క్లుప్తంగా

30న మండల సమావేశం

ఉలవపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

5 నుంచి నాటక పోటీలు

లింగసముద్రం: పావనీ ఆర్ట్స్ ద్వారా ఆధ్వర్యంలో ఎం.రాఘవేంద్రరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో జూన్ 5, 6,7 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో మండలంలోని పెద పవని ప్రతిభా హైస్కూల్ ఆవరణలో నాటక పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5న జరుగుతున్న కథ, జీవనయానం, నాన్నా నేనువస్తా, 6న రాత, మూల్యం, ఆలీతో సరదాగా, 7న ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటక పోటీలు ప్రదర్శిస్తామన్నారు.

డీపీఓ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సుస్మిత

ఉలవపాడు: స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత మంగళవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. కార్యదర్శి సెలవులో ఉండటం, ఈఓపీఆర్డీ అనారోగ్యంతో వైద్యశాలలో ఉండటంతో రికార్డులు పూర్తిస్థాయిలో పరిశీలించలేదని తెలిపారు. ఎంపీడీఓ విజయకుమారి, సర్పంచ్ నాగలక్ష్మి, ఇన్‌ఛార్జి సెక్రటరీ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

1052 పొగాకు బేళ్ల కొనుగోలు



వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 1052 పొగాకు బేళ్లు కొనుగోలు చేశారు. ఎం. నిడమానూరు క్లస్టరు గ్రామాలకు చెందిన రైతులు 1143 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 1052 కొనుగోలు జరిగగా, 91 పొగాకు బేళ్లు తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 321 కాగా, కనిష్ట ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 260. 38 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



గుడ్లూరులో విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుడ్లూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక ఎర్రన గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు క్విజ్ పోటీలు ఉపయోగపడతాయన్నారు. క్విజ్‌లో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తామన్నారు.

7న మోటార్ సైకిళ్లు స్వాధీనం



మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీ పెద్దన్నబోయిన పాలెంలో మంగళవారం ఉదయం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్నికల కౌంటింగ్ ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై టి. శ్రీరామ్ తెలిపారు. సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఇంటింటి తనిఖీ నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడిన వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. ఏఎస్సైలు షేక్ మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ బేగ్, శేషారెడ్డి, రైటర్ షేక్ షాకీర్ బాషా, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలట్‌లు 3052

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 27వ తేదీ నాటికి మొత్తం 3052 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్లు సబ్‌కలెక్టర్, ఆర్‌ఓ రాహుల్‌మీనా మంగళవారం తెలిపారు.

పుస్తకాలొచ్చాయ్..!

- బడి తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక
- మండలాలకు చేరిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌లు



మండల కేంద్రాలకు చేరిన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు



స్టాక్ పాయింట్‌లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన, ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది విద్యా కానుక కిట్లను పంపిణీకి సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విద్యా కానుకను గత నాలుగేళ్ల నిరాటంకంగా అందచేశారు. ఈ తరుణంలో ఈ ఏడాది కూడా విద్యాకానుక కిట్లు పంపిణీకి ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఇండెంట్‌లను సిద్ధం చేశారు.

సార్వత్రిక ఎన్నికల కారణంగా పంపిణీకి ఎక్కడా విఘాతం కల్గకూడదనే ఉన్నత లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యా కానుక కిట్లను ముందుగానే సిద్ధం చేసింది. జూన్ మొదటి వారానికి విద్యా కానుక కిట్లలో మెటీరియల్ మొత్తం మండలాల్లోని స్టాక్ పాయింట్‌లకు చేరుతాయని అధికారులు తెలిపారు. ఇప్పటి కే 1,52,234 నోట్ బుక్స్‌లు, 40,085 పాఠ్య పుస్తకాలు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని కేంద్రాలకు (స్టాక్ పాయింట్‌లకు) చేరాయి. ఇంకా కొంతమేర రావాల్సి ఉంది.

మండల కేంద్రాల్లో నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు

ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందచేయాల్సిన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు దాదాపు అన్ని మండల కేంద్రాలకు చేరాయి. ప్రభుత్వానికి పంపిన ఇండెంట్ ప్రకారం విద్యా సామగ్రిని సరఫరా చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు సుమారు 458 ఉన్నాయి.

ఈమేరకు గతేడాది ఆయా పాఠశాలల్లో 1–10 తరగతుల విద్యార్థులు సుమారు 27,011 మందికి రూ 7,13,68,800 విలువైన జేవీకే కిట్స్ అందచేసినట్లు నివేదికలున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది మరో పదిశాతం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మండలాల వారీగా చేరిన పాఠ్య, నోట్ పుస్తకాల వివరాలు:

మండలం	పాఠ్య పుస్తకాలు	నోట్ పుస్తకాలు	మొత్తం పాఠశాలలు
కనిగిరి	17,000	50,142	116
హెచ్‌ఎంపాడు	6,176	16,026	66
పీసీపల్లి	6,281	17,460	59
సీఎస్‌పురం	7,200	20,518	63
పామూరు	10,653	26,636	88
వెలిగండ్ల	8,075	21,452	66
మొత్తం	40,085	1,52,234	458

పాఠశాలలు తెరిచిన రోజే కిట్లు పంపిణీ

ఐదో విడత పంపిణీ చేయాల్సిన విద్యా కానుక కిట్లను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే అన్ని మండల కేంద్రాలకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు చేరాయి. జూన్ మొదటి వారానికి అన్ని రకాల సామగ్రి ఇండెంట్ ప్రకారం వస్తాయి. పాఠశాలలు తెరిచిన రోజే కిట్లు పంపిణీ చేస్తాం.



– దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు

ఘనంగా గంగ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



పూలబండ్లు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న గంగ తిరునాళ్ల మంగళవారంతో ముగిసింది. తిరునాళ్ల చివరి రోజు కావడంతో భక్తులు భారీగా హాజరయ్యారు. భక్తులు పొంగళ్లు, కుంకుమ బళ్లు, పూలబళ్లు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయాల్లో బొల్లావులను ఊరేగించాలంటే ఇక్కడకు వచ్చి ముద్రలు వేయించుకున్న తర్వాతే వాటిని ఊరేగించాలన్న సంప్రదాయం ఉండడంతో బొల్లావులకు ముద్రలు వేయించడం కోసం యజమానులు బొల్లావులతో బారులు తీరారు. పాలేటి నది ఒడ్డున ఉన్న గుంటి గంగకు పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరి కనిపించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్ బాబులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాలేటి వద్ద ఉన్న గుంటి గంగకు పూజలు



ముద్రల కోసం సిద్ధంగా ఉన్న బొల్లావులు

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఓవీరోడ్డు, ప్రధాన వీధుల్లో చైర్మన్ గఫార్ పర్యటించారు. స్థానికులు కొత్త స్తంభాల ఏర్పాటు, నూతన ట్రాన్స్‌ఫారంల ఏర్పాటు, విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలను చైర్మన్ గఫార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఉప్పురోడ్డులో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు కొత్తవి మంజూరు చేయాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. ఏఈ పవన్ కుమార్, కాంట్రాక్టర్ యోగిరెడ్డి, నాయకులు రామనబోయిన శ్రీనివాసులు, నాదెండ్ల నరసింహారావు, కోటా రాజా, ఇతా వెంకటేశ్వర్లు, తాళ్లూరి లక్ష్మీ నారాయణ, తాల్లూరి రమేష్, కంచర్ల ప్రసాద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామి భూములకు వేలం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో ఒకటైన శ్రీ పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి భూములను లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 30న పొదిలి నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నారు. ఈమేరకు కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారుల సమక్షంలో ఈ నెల 30 తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఈ వేలం పాటలో పాల్గొన దలచినవారు రైతులు ముందుగా రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

జూన్ 3న బహిరంగ వేలం పాట

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ శ్రీ వరాహాలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జూన్ 16 నుంచి 26వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో పలు ఉత్పత్తులు అమ్ముకునేందుకు జూన్ 3 ఉదయం 11 గంటలకు దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థాన ఈఓ పి. కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, కూల్ డ్రింక్స్, బొమ్మలు అమ్ముకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తామని.. ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

నాడు–నేడు పనులపై సమీక్ష



హెచ్‌ఎంలు, అధికారులతో సమీక్షిస్తున్న ఎంఈఓ కరుణకుమారి

పామూరు: మండలంలో జరిగిన నాడు–నేడు పనులపై స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం సమావేశ హాలులో మంగళవారం విద్యాశాఖాధికారి గరికపాటి కరుణకుమారి పాఠశాల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మండలంలో నాడు–నేడు కింద రెండో విడత 27 పాఠశాలల్లో జరిగిన సుమారు రూ.8 కోట్ల పనుల గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకున్నారు. ఆయా పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు, ఇతర అంశాలపై చర్చించారు. పూర్తి నివేదికను రెండురోజుల్లో ఇవ్వాలని హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నందిరెడ్డిపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వాలిచర్ల పంచాయతీ నందిరెడ్డిపల్లిలో మంగళవారం కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి వేదపండితులు, అర్చకుల వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, జి.వెంకటేశ్వరెడ్డి, అంజలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

223 మందికి వైద్య పరీక్షలు



బసిరెడ్డిపాలెంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మారుతీరావు

గుడ్లూరు: మండలంలోని బసిరెడ్డిపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్య శిబిరంలో 223 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి మారుతీరావు తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్టు డాక్టర్లు భార్గవ్, సౌందర్య, మారుతీరావు 223 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. 14 మందికి కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలకు సిఫార్సులు చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లు



గుడ్లూరులో పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువెళుతున్న రజకులు

గుడ్లూరు: స్థానిక రజక బజారులో ఉన్న అమ్మవారు–అయ్యవార్ల ఆలయంలో తిరునాళ్లలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం అమ్మవారు–అయ్యవార్లకు రజకులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ఇళ్ల వద్ద పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. పొంగళ్లను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయంలో అమ్మవారికి అయ్యవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఇళ్ల వద్ద బంధువులు, స్నేహితులతో కలసి ఆనందోత్సాహాలతో, పండుగ వాతావరణంలో భోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి అమ్మవారు–అయ్యవార్లకు వైభవంగా తిరునాళ్లు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో దద్దాల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: కర్ణాటక రాష్ట్రంలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రం 'ఘాటీ సుబ్రహ్మణ్యస్వామి' ఆలయంలో వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, సీఎస్పురం నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే బెంగుళూరులో సీఎస్‌పురం మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు దద్దాల నారాయణ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ముత్యాల నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, కత్తులపల్లి రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గంట వెంకట్రామిరెడ్డి, కందుల నారాయణరెడ్డి, గూడపురెడ్డి తిరుపతిరెడ్డి, గానుపెంట నారాయణరెడ్డి, కందుల తిరుపతిరెడ్డి, వివేకానందరెడ్డి, జాజుల తిరుపాలు, గోపాల్ రెడ్డి, బొర్రాజు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉంచాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పద్మావతి

ఉలవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల రిజిస్టర్లు కేంద్రాల్లోనే ఉంచాలని, ఇంటికి తీసుకువెళితే కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల కేంద్రమైన ఉలవపాడు నాల్గవ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం, కొల్లూరుపాడులోని 2వ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్యకర్తలు రిజిష్టర్లు ఇంటికి తీసుకొని పోతే వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. వేసవి కాలం కావడంతో కేంద్రాలలో మంచినీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎత్తు, బరువులు తక్కువగా ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోడి గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె, బాలామృతం, బాలసంజీవని సంబంధించి రిజిష్టర్లు, కేంద్రాల్లో ఉన్న స్టాకు పరిశీలించారు. అనంతరం ఉలవపాడు పీహెచ్‌సీని తనిఖీ చేసి బాలలకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన



కౌంటింగ్ హాల్ పరిశీలనలో ఆర్వో, చీఫ్ ఏజెంట్లు

కనిగిరి రూరల్: ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లకు నియమ నిబంధనావళిపై మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాలపర్తి జాన్ ఇర్విన్ కౌంటింగ్ ఏజెంట్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఏజెంట్లు ప్రతి ఒక్కరూ విధిగా ఐడీ కార్డులు తీసుకుని రావాలని, నిర్దిష్ట సమయంలో కౌంటింగ్ హాల్‌లో ఉండాలని, ఎన్నిలక నియమ నిబంధనావళి పాటించాలని తెలిపారు. 14 టేబుళ్లలో, 22 రౌండ్‌లలో లెక్కింపు జరుగుతుందని, ప్రతి రౌండ్‌కు సంబంధించిన లెక్కింపు ఎప్పటికప్పుడు కౌంటింగ్ ఏజెంట్లకు ఇచ్చిన బుక్‌లెట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ హాల్‌లోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లి తిరిగి వచ్చే అవకాశం ఉండదన్నారు. తొలుత ఆర్వో పి.జాన్ ఇర్విన్ కౌంటింగ్ చీఫ్ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్‌ను, స్ట్రాంగ్ రూంలను చూపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరిపేందుకు చేసిన ఏర్పాట్లను వివరించారు. కౌంటింగ్ హాల్‌లో పోటీ చేసిన అభ్యర్థి లేదా చీఫ్ ఏజెంట్ లోపల ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ కృష్ణారావు, అధికారులున్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

లింగసముద్రం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని కందుకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్సై ఎం.బాజీబాబులతో కలిసి మంగళవారం సాయంత్రం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఎన్నికల కోడ్ ముగిసేవరకు ముగిసేవరకు మండల పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. జూన్ 4న కౌంటింగ్ రోజున ఎవరు కూడా విజియోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు.

బాణసంచా కాల్చడం కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.